## క్లుప్తంగా

### స్వామి వారికి పల్లకీ సేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో సోమవారం వైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం, భక్తులకు అన్నదానం చేశారు. పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు పాల్గొన్నారు.

### ముగిసిన షోడశ ఉత్సవాలు



అగ్నిగుండంపై నడుస్తున్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించిన షోడశ వార్షిక వేడుకలు ముగిశాయి. చివరి రోజు సోమవారం ఆలయంలో భద్రకాళీ పూజ నిర్వహించారు. భక్తులు అగ్నిగుండాల్లో నడిచి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### శిలాఫలకాన్ని తొలగించాలని విజ్ఞాప్తి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన వైకుంఠధామానికి మాజీ సర్పంచ్ కుటుంబానికి చెందిన స్వర్గస్తులైన వారి పేర్లతో శిలాఫలకం ఏర్పాటు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గ్రామానికి చెందిన సామ ప్రకాశ్‌రెడ్డి, మాధవాచారి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రెహ్మాన్‌కు వినతిపత్రం అందించారు. ఆ నిర్మాణాన్ని ఏ నిధులతో నిర్మించారో పరిశీలించి శిలాఫలకాన్ని తొలగించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

### బాధిత కుటుంబానికి బాల్య మిత్రుల చేయూత



కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న బాల్య మిత్రులు

కందుకూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1994–95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు మానవత్వం చాటారు. వారితో పాటు చదువుకున్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన శ్రీశైలం మృతి చెందడంతో, అతని కుటుంబానికి అండగా నిలిచారు. ఈ మేరకు సోమవారం రూ.50 వేల నగదును కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వరలక్ష్మి, సునీత, సంతోష, అంజయ్య, జనార్దన్, సుదర్శన్, లక్ష్మారెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, యాదగిరి, జంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను అందజేస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గ్లోబల్ చాంపియన్స్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతను పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పాఠశాలకు గ్రామాల నుంచి నడుచుకుంటూ వస్తున్న విద్యార్థినీలను గుర్తించి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ కోశాధికారి శ్రీనివాస్, ప్రతినిధి డాక్టర్ కర్ణ మాట్లాడుతూ.. అన్ని విధాలా పాఠశాలకు సహకారం అందిస్తామన్నారు. అంకితభావంతో గుణాత్మక విద్యను అందిస్తున్న గురువులను అర్థం చేసుకుని, వారి జ్ఞానాన్ని అందిపుచ్చుకుని ర్యాంకుల వేటలో పడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్, ప్రధానోపాధ్యాయుడు రామాంజన్, చైతన్యకుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గడ్డికి గడ్డుకాలం!

- వరి కోత మిషన్లతో తగ్గిన ఎండు గడ్డి
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎండు గడ్డి

మహేశ్వరం: పాడి రైతులకు గడ్డు రోజులు ఎదురవుతున్నాయి. ఎండుగడ్డి కొరత తీవ్రంగా ఉండడంతో పశుపోషణ రోజురోజుకు భారంగా మారుతోంది. వరిసాగులో కూలీల కొరత వేధిస్తుండడంతో దాని ప్రభావం పశుగ్రాసంపై పడింది. మండలంలోని పాడిపైన ఆధారపడ్డ రైతులు ఎక్కువగానే ఉన్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో వచ్చే వరిగడ్డి పశువుల మేతకు ఉపయోగిస్తారు. వరి సాగు చేసిన రైతులు కూలీలతో పంటను కోయించకుండా వరి కోత మిషన్లు (హార్వేస్టర్స్)తో కోయిస్తున్నారు. దీంతో ఎండుగడ్డి ఆశించినస్థాయిలో రావడంలేదు. కొందరు రైతులు ఎండు గడ్డిని పంట పొలాల్లోనే దగ్ధం చేస్తున్నారు. మండలంలో ఇదివరకు అన్ని గ్రామాల్లో వరి పంటను సాగు చేయడంతో ఎండు గడ్డి పుష్కలంగా లభించేది. ప్రస్తుతం సాగు తగ్గడంతో పశుగ్రాసానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టారు. పాడి రైతులు వరి గడ్డి కోసం ఇతర జిల్లాలు, మండలాల నుంచి లారీలు, ట్రాక్టర్లలో తెచ్చుకుంటున్నారు.వ గడ్డి కొరత ఎక్కువగా ఉండడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. పాడి రైతులు వరిగడ్డిని కొనలేక ఎక్కువ శాతం పచ్చిమేత, సొప్ప మీద ఆధారపడుతున్నారు.

**పెరిగిన ధరలు**

వరిగడ్డి ధరలు ఈ సీజన్‌లో రెట్టింపయ్యాయి. గతంలో ఒక ట్రాక్టర్ వరి గడ్డి రూ.6వేల నుంచి రూ.10 వేల వరకు కాగా ఈ సీజన్‌లో రూ.10 వేల నుంచి 15 వేలు పలుకుతోంది. లారీ వరి గడ్డి సుమారు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెరిగింది. దీంతో రైతులకు వరిగడ్డి దొరకక పశుపోషణ భారంగా మారింది. పాడి రైతులు గడ్డి ధరలు విపరీతంగా పెరగడంతో ప్రత్యామ్నాయంగా సొప్ప, కుట్టీ, పచ్చిగడ్డిలతో పాటు దాణాలను వాడుతున్నారు. మార్కెట్లో పశువుల దాణా ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. శనగచెక్క, కొబ్బరి పిట్టు, పెసర పొట్టు, గోధుమ పొట్టు, పత్తి చెక్క, మినపపొట్టుతో పాటు పలు రకాల దాణాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంత మంది పాడి రైతులు పాల నుంచి లాభాలు రాకున్నా పశువులకు అప్పులు చేసి పశుగ్రాసం, దాణాలు పెడుతున్నాయి. గతంలో పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు గడ్డి విత్తనాలు సబ్సిడీపైన అందజేసేవారు. అధికారులు అక్కడక్కడ కొన్నిచోట్ల పంపిణీ చేసి, మిగిలిన వారికి అయిపోయాయని రైతులకు చెబుతున్నారు.

**కొనాలంటే ఇబ్బంది**



ఎండు గడ్డి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రోజు పశువులకు పచ్చిమేతతో పాటు కొంత వరి గడ్డిని వేస్తాం. ధరలు పెరగడంతో ఎండు గడ్డిని కొనలేని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితిలో అప్పులు చేసి మరి అధిక ధరకు కొంటున్నాం.

– చేవంగి శంకరయ్య, పాడి రైతు, కోళ్లపడకల్

**భారంగా పశుపోషణ**



కూలీల కొరత కారణంగా వరి ఎండుగడ్డికి డిమాండ్ పెరిగింది. దీంతో ప్రత్యామ్నాయంగా సొప్ప, కుట్టీ, పచ్చిమేతతో పాటు ఇతర పశుగ్రాసాలను మేతగా వేస్తున్నాం. ప్రస్తుతం దాణా ధరలు విపరీతంగా పెరగడంతో పశుపోషణ భారంగా మారింది.

– ఎర్ర శంకరయ్య, పాడి రైతు, ఘట్టుపల్లి

# ధరణి సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: ధరణి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌తో ప్రజలకు ఉపయోగం లేదని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి విమర్శించారు. సోమవారం తన చాంబర్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రెవెన్యూ అధికారులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ద్వారా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎండల్లో పడిగాపులు కాస్తున్నారన్నారు. కేవలం పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ ఉంటే బీఆర్‌ఎస్ పార్టీ ఉపేక్షించదని, రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సామయ్య, కార్యదర్శి వెంకటేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నడకతో ఆరోగ్యానికి మేలు

హుడాకాంప్లెక్స్: నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని, ప్రతి ఒక్కరూ నడుస్తూ తోటి వారిని నడిపించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ శ్రీనివాసచారి అన్నారు. క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ కార్యక్రమాన్ని హుడాకాంప్లెక్స్‌లోని సీనియర్ సిటిజన్స్ భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా దాచేపల్లి శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా చోలేటి ఆనంద్, కోశాధికారిగా నరసింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీనివాసచారి.. మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ ఆధ్వర్యంలో మంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో శివప్రసాద్, చక్రపాణి, లింగప్రకాశ్, మాధవరావు, సంపత్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, గౌరీశంకర్, శ్రీనివాసచారి, మురళీకృష్ణ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

# తాగునీటి సరఫరాకు వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: తాగునీటిని రోజు విడిచి రోజు విడుదల చేయాలని కోరుతూ.. సోమవారం వినాయకహిల్స్ కాలనీవాసులు అధికారులకు విన్నవించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని 5వ డివిజన్ కార్పొరేటర్ దీపిక శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులను కలిశారు. వినాయక హిల్స్ కాలనీలో ఐదు రోజులకోసారి తాగునీటిని విడుదల చేస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

# బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి



ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొండి వైఖరి సరైంది కాదని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భాస్కర్ తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లోని ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు జగన్, నర్సింహా, అలంపల్లి నర్సింహా, రవికుమార్, మున్సిపాలిటీ కన్వీనర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

**బహిర్గతం చేయాలి..**

మంచాల: ఎస్‌బీఐ బాండ్ల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదయ్య అన్నారు. సోమవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను తప్పక పాటించాలని కోరారు. ఆ పార్టీ మండల కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గరాములు, రాజు, స్వామి, గోపాల్, రవి, వెంకటేశ్, పాండు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా రథోత్సవం

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిహోమం, రుద్ర హోమం నిర్వహించి అనంతరం ఉత్సవ మూర్తులను రథంపైన ఊరేగించారు. గ్రామానికి చెందిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత నాట్యం, కథకేళి, నాటికలు, మ్యాజిక్ షోలు, సాంస్కతిక కార్యక్రమాలు అబ్బురపరిచారు. రథోత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు రాకేష్, రాకేష్, కన్నయ్య, జగన్‌ముదిరాజ్, సాయిలు, శ్రీశైలం ఆలయ ఈఓ మురళీకృష్ణ, ప్రధాన పూజారి వీరేశం, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



ఉత్సవమూర్తులతో ఆలయ కమిటీ సభ్యులు

# వందశాతం వసూళ్లే లక్ష్యం

- మున్సిపాలిటీ పరిధిలో రూ.6.38 కోట్ల పన్నుల డిమాండ్
- ఇప్పటివరకు రూ.3.38 కోట్ల మేర వసూలు
- గడువులోపు లక్ష్యం చేరుకుంటామంటున్న అధికారులు
- ప్రత్యేకంగా 20 మంది సిబ్బంది కేటాయింపు




ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ఇంటిపన్నుతోపాటు వ్యాపార దుకాణాలు, పరిశ్రమలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాలు, విద్యాలయాల ద్వారా 2023–24 సంవత్సరానికిగాను రూ.6,38,43,000 పన్నులు వసూలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకోగా ఇందులో గత సంవత్సరం పెండింగ్ బాకాయిలు రూ.2.42 కోట్లు ఉన్నాయి. మార్చి 11వ తేదీ వరకు(సోమవారం) రూ.3,00,68,000 మేర పన్నులు వసూలయ్యాయి. అంటే సుమారు 52 శాతం మేరకు మాత్రమే పన్నులు వసూలైనట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 31వ తేదీ(తుది గడువు)లోపు నిర్ణీత లక్ష్యం చేరుకునేలా మున్సిపల్ యంత్రాంగం కార్యచరణ ప్రారంభించింది. 100 శాతం పన్నులను వసూలు చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**తగ్గిన ఆదాయవనరులు..**

గత మూడేళ్లుగా మున్సిపాలిటీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయ వనరులు తగ్గాయి. దీంతో సిబ్బంది జీతభత్యాలు, అభివృద్ధి పనులకు డబ్బులు కావాలంటే.. భవన నిర్మాణాల అనుమతులు, బెటర్‌మెంట్ చార్జీలు, వివిధ పన్నుల రూపేణా వచ్చే ఆదాయంపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా 20 మంది సిబ్బందిని పన్నుల వసూళ్లకై నియమించారు. ప్రతిరోజు ఇంటింటికి, ప్రతి దుకాణానికి తిరుగుతూ పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యతను వీరిపై పెట్టారు. ఇప్పటికే పన్నుల చెల్లించనవారికి రెడ్ నోటీసులను అందజేశారు. వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు.

**సౌకర్యాల నిలిపివేత..**

ఇప్పటికీ పన్నులు చెల్లించకుంటే మున్సిపాలిటీ కల్పిస్తున్న సౌకర్యాలను నిలిపివేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇందులో మొదటగా ఇంటి నల్లా కనెక్షన్‌ను కట్‌చేసి నీటి సరఫరాను నిలిపివేస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల నుంచి రావాల్సిన సుమారు 2.50 కోట్ల రూపాయల బకాయిలు మాత్రం యాధావిధిగా ఉంటుండటంతో నిర్ణీత వంద శాతం టార్గెట్‌ను పూర్తిచేయలేకపోతున్నామని మున్సిపల్ సిబ్బంది చెబుతుండటం కొసమెరుపు.

**పన్నులు చెల్లించకుంటే చర్యలు**

ఈ ఆర్థిక సంవత్సరంలోపు వివిధ రకాల పన్నులను వంద శాతం వసూలు చేస్తాం. ఇందుకు అనుగుణంగా 20 మంది సిబ్బందిని పన్ను వసూ ళ్లకు ప్రత్యేకంగా నియమించాం. పన్నులు చెల్లించాలని రెడ్ నోటీసులు జారీ చేశాం. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి. చెల్లించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

# జెడ్పీహెచ్‌ఎస్‌లో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతలు సహరించాలని విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆర్‌ఎం సిరాజుద్దీన్ కోరారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో గల జెడ్పీహెచ్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఆ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారన్నారు. బోరు బావి నీరు తాగే విద్యార్థులకు సిరాజుద్దీన్ అండగా నిలవడం గర్వకారణమన్నారు. స్థానికంగా ఉండే మరో దాత లింగల్ల భాస్కర్ వాటర్ ప్లాంట్ గది నిర్మాణానికి రూ.20 వేలు విరాళం ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, ఏరియా మేనేజర్ డాక్టర్ సురేందర్, రవీందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల భవనాన్ని పూర్తిచేయండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి ఎన్‌ఎస్‌యూఐ నేతల వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. నందకిషోర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని.. ప్రస్తుతం నిర్మాణ పనులను నిలిపివేశారని తెలిపారు. పనులు పూర్తి చేసి డిగ్రీ తరగతులు ఈ విద్యా సంవత్సరంలో కొత్త భవనంలో ప్రారంభం అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి.. పనులు ఎందుకు నిలిచిపోయాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరంలోనే భవనం అందుబాటులోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.